నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 | RAJANNA SIRCILLA

'నేను ఇక్కడికి నాయకుడిగా రాలేదు. కొదురుపాక మనుమడిగా వచ్చిన. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ నిర్మాణానికి ముందు శాభాష్‌పల్లి పాత వంతెన పైనుంచి వానకాలంలో ఎప్పుడూ వరద వచ్చేది. దాటనిచ్చేది కాదు, తక్కువ నీళ్లు వస్తే ప్యాంట్ పైకి మలుచుకుని వెళ్లేది. తర్వాత మా తాతయ్య కేశవ రావు అడ్డ రోడ్డు నుంచి ఆటో రిక్షాలో కొదురుపాక సుభాష్ బొమ్మ వద్దకు తీసుకెళ్లేటోడు. అక్కడి నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్లేవాళ్లం. మా అమ్మమ్మ ఇంటి ముందు అనంతరాములు సేట్ దుకాణం ఉండేది. అందులోంచి బిస్కెట్ పూడలు తీసుకొని తినేది. మా అమ్మమ్మ ఊరు కొదురుపాక ఎంఎంఆర్‌లో, నాయనమ్మ ఊరు అప్పర్ మానేర్ డ్యామ్‌లో, ఇంకో అమమ్మ ఊరు వచ్చునూర్ ఎల్ఎండీలో ముంపునకు గురయినయి. ముంపు గ్రామాల సమస్య లేంటో నాకు తెలుసు'

- ఇలా కొదురుపాకలో కేటీఆర్ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు

కొదురుపాక మనుమడిగా వచ్చా.. అండగా ఉంటా

- బడి పూర్తయింది.. మిగిలిన గుడుల నిర్మాణానికి కృషి చేస్తా
- చాకలి ఐలమ్మ జయంతి రోజు ప్రారంభించడం సంతోషంగా ఉంది
- ముంపులో మా అమ్మమ్మ, నాయనమ్మల గ్రామాలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- ఎమ్మెల్యే సత్యంతో కలిసి పాఠశాల భవనానికి ప్రారంభోత్సవం

నేతన్నలకు ఉపాధి చూపినం

వస్త్ర పరిశ్రమకు కేంద్రబిందువైన సిరిసిల్లను మరో తిరుపూర్‌గా తీర్చి దిద్దాలన్న ఉద్దేశ్యంతో వస్త్ర ఉత్పత్తిదారులను స్టడీ టూర్‌కు బస్సుల్లో తమిళనాడుకు పంపించినం. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.వేల కోట్ల వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు ఇవ్వడం వల్ల వేతనాలు రెట్టింపు అయినయ్. రూ.8 వేలు సంపాదించే కార్మికులు రూ.20 వేలు సంపాదించే స్థాయికి ఎదిగిన్రు. ఆత్మహత్యలు, ఆకలి చావుల నుంచి బయటపడి ఇప్పుడిపుడే మొహం తెలివికొస్తుందన్న సమయంలో దురదృష్టవశాత్తు మా ప్రభుత్వం పోయి దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. నా మీద కోపం.. మా పార్టీ మీద కోపం.. ఇక్కడి ప్రజలు నన్ను ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించండ్రన్న కోపం.. కాంగ్రెస్‌ను తిరస్కరిస్తున్నారన్న కోపంతో ప్రజలపై, నేతన్నలపై పగపట్టి ప్రతికారం తీర్చుకుంటున్నరు. బతుకమ్మ చీరెల ఆర్డర్లు బంద్‌జేసిన్రు. నేతన్నలను ఆత్మహత్యల బాటను పట్టించింది ఈ దివాళాకోరు కాంగ్రెస్ ప్రభుత్వమే. 2004 నుంచి 14 వరకు ఆత్మహత్యలు జరిగినయి. ఒకేవారంలో 9 మంది నేతన్నలు ప్రాణం తీసుకున్నరు. వారి కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ, మేం రాష్ట్రంలోని కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెల ఇవ్వాలని నిర్ణయించి, అవి సిరిసిల్లలోనే తయారు చేయించి ఉపాధి చూపినం. మూత పడ్డ సాంచాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చి ఎనిమిది నెలల పాటు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో వేలాది మంది కార్మికుల కడుపు నింపిన మహానుభావుడు కేసీఆర్. బతుకమ్మ చీరెలే కాకుండా స్కూల్ యూనిఫాంలు, కేసీఆర్ కిట్టులో ఇచ్చే చీరలు, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలు సిరిసిల్లలో తయారు చేయించినం. భవిష్యత్తులో ఆత్మహత్యలు జరుగవద్దన్న ఉద్దేశ్యంతో ఇచ్చిన మాటకు కట్టుబడి ₹3,312 కోట్ల వస్త్ర ఉత్పత్తి ఆర్డర్లు సిరిసిల్లకు ఇచ్చినం. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లతో సాంచాల్లో సంక్షోభం తొలగి ఆత్మహత్యలు ఆగిపోయినయి.

- సిరిసిల్లలో కేటీఆర్

బోయినపల్లి, సెప్టెంబర్ 26: కొదురుపాక మనుమడిగా గ్రామానికి ఎప్పటికీ అండగా ఉంటానని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా ఇచ్చారు. తన అమ్మమ్మ, తాతయ్య జోగినపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం తన సొంత డబ్బుతో గ్రామంలో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు కేటీఆర్‌కు హైలెవల్ వంతెన వద్ద చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తిరుపతి దేవస్థానం ప్రసాదం ఇవ్వగా, బీసీఎం వ్యవస్థాపకుడు, ప్రముఖ కంటివైద్య నిపుణుడు వైరాగ్యం రాజలింగం పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కేటీఆర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కరచాలనం చేస్తూ పేరు పేరునా పలుకరించారు. తర్వాత చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పాఠశాల, తరగతి, కంప్యూటర్ గదులు, డైనింగ్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు. ప్రస్తుతం తమ అమ్మమ్మ ఊరిలో పాఠశాల నిర్మాణం పూర్తయిందని, గ్రామంలో మిగిలిన ఆలయాలను కూడా రాజకీయాలకతీతంగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతి రోజు పాఠశాల భవనాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాస్తవంగా ప్రారంభోత్సవానికి అమ్మ శోభ రావాల్సి ఉండెనని, కానీ ఆమె రాలేక పోవడం వల్ల వారి ఏకైక సోదరుడైన తన మేనమామ జోగినపల్లి శ్రీనివాసరావును పంపించారని చెప్పారు. వేదికపై పేరు పేరునా పిలుస్తున్న సమయంలో పిలువని వారు తిట్టుకోవద్దని, ఒక వేళ తిట్టుకుంటే లోపల తిట్టు కోవాలని, బయటకు తిట్టుకోవద్దని అంటూ నవ్వులు పూయించారు. 'చొప్పదండి ఎమ్మెల్యే సత్యం మా వాడు.. నా తమ్ముడు.. ఎందుకంటే నా నియోజకవర్గ పరిధిలోని కోరుట్లపేట ఓటరు' అని చెప్పడంతో వేదిక కింద ఉన్న అందరూ నవ్వుతూ 'జై కేటీఆర్', 'జై కేసీఆర్' నినాదాలతో హోరెత్తించారు. కేటీఆర్ తమ కుటుంబ సభ్యులను గుర్తు చేస్తున్న తరుణంలో విద్యార్థులు కేరింతలు కొట్టగా.. 'జర ఆపండ్రా బాబూ మా వాళ్లనే మేం గుర్తు చేయద్దా' అని నవ్వుతూ ప్రసంగించారు. కొదురుపాకలో ఆలయాలు నిర్మాణం పూర్తయ్యాక ఊరందరికీ తానే భోజనాలు పెడతానని చెప్పగా, వెంటనే సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకట్రామారావు లేచి 'లేదు.. లేదు నేనే పెడతా' అని చెప్పారు. దీంతో కేటీఆర్ స్పందిస్తూ 'అగో చూసినవా.. వెంకట్రామారావు మామయ్య ఒప్పు కోవడం లేదు. ఓకే' అని చెప్పారు. అనంతరం తన అమ్మమ్మ-తాతయ్య పేరుతో కొదురుపాకలో అత్యాధునిక హంగులతో పాఠశాల భవనం నిర్మించినందుకు కేటీఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీవో జయశీల, సింగిల్ విండో చైర్మన్ జోగినపల్లి వెంకట్రామరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొండయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బొలుమాల శంకర్ కూస రవీందర్, భీమ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి, ఆరు మండలాల బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలున్నారు.



పాఠశాల భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

విద్యార్థినికి బ్యాగు అందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్

అధికారులూ అత్యుత్సాహం వద్దు

సిరిసిల్లలో నేతన్నలే కాదు, అందరూ ఇబ్బంది పడుతున్నరు. ఇక్కడ ఓ విచిత్రమైన పరిస్థితి. అధికారులు కూడా కాంగ్రెస్ పార్టీ నాయకుల్లాగా అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నరు. మా ప్రభుత్వ హయాంలో చిన్నచిన్న పల్లెలను కొత్త గ్రామ పంచాయతీలు చేసి 54 రేషన్ దుకాణాలను ఏర్పాటు చేసినం. దుకాణాలు పెట్టి స్థానికంగా ఉండే పొదుపు సంఘాల మహిళలకు బాధ్యతలు ఇచ్చినం. కొంత ఆదాయం వస్తున్న ఉద్దేశంతో ఇచ్చిన దుకాణాలను నాపై నాలుగుసార్లు ఓడిపోయిన వ్యక్తి, ఇక్కడ ప్రభుత్వాన్ని నేనే నడుపుతానంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేకే మహేందర్‌రెడ్డికి అధికారులు వంత పాడుతూ ఆగమాగమైతున్నరు. అధికారులకు నేనొక్కటే చెపుతున్న. మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు సైతం సస్పెండ్ అయ్యిన్రు. చట్ట ప్రకారం కాకుండా, కానూన్ ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్లు చేస్తమంటే మాత్రం తప్పకుండా ఫలితం అనుభవిస్తరు. చట్ట ప్రకారం పనిచేయండి. ఇష్టం వచ్చినట్లు చేస్తమంటే ఊరుకోం. మీకు తెలుసు, మాకు తెలుసు, ప్రజలకు తెలుసు.. మళ్లీ మూడున్నర నాలుగేళ్లలో కేసీఆర్ తిరిగి వస్తరు.

- సిరిసిల్లలో కేటీఆర్

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కొదురుపాకలో మాజీ మంత్రి కేటీఆర్ తన అమ్మమ్మ-తాతయ్య జ్ఞాపకార్థం పాఠశాల భవనం నిర్మించడం చాలా సంతోషమని, అందుకు రామన్నను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులు, ఉపాధ్యాయుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థ పూర్తిగా వెనుకబడిపోయిందని, ప్రస్తుత ప్రభుత్వం విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలల్లో సమస్యలను పరిష్కరిస్తుందని చెప్పారు.
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ అమ్మమ్మ- తాతయ్య పేరిట పాఠశాల భవనం నిర్మించిన మాజీ మంత్రి కేటీఆర్ నిజమైన హీరో అని కొనియాడారు. దేశం, రాష్ట్రంలో ఎంతో మంది కోటీశ్వర్లుంటారు కానీ, గ్రామాలకు ఇలా ఎవరూ సేవ చేయరు అని చెప్పారు.

హాజరైన విద్యార్థులు, ప్రజలు, కార్యకర్తలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేటీఆర్, వేదికపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాయకులు

గొల్లపల్లిలో చాకలి ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

గొల్లపల్లి, సెప్టెంబర్ 26: చాకలి ఐలమ్మ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రజలు చైతన్యవంతం కావాలని, అవినీతి అన్యాయాలపై పోరాడాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం గొల్లపల్లి మండలంలో పర్యటించిన ఆయన, మండల కేంద్రంలోని చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూమికోసం, భుక్తి కోసం దొరలపై పోరాడిన వీరవనిత ఐలమ్మ అని కీర్తించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జలందర్, మాజీ వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, పార్టీ మండల కోఆర్డినేటర్ గంగాధర్, రంజక సంఘం అధ్యక్షుడు కలకోట సత్యం, మజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మాండ్లు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ఎక్కి ఆందోళన చేస్తున్న తాజా మాజీ రేషన్ డీలర్లు

మా షాపులు మాకే ఇవ్వాలి

- సిరిసిల్లలో తాజామాజీ రేషన్ డీలర్ల ఆందోళన
- పెట్రోల్ బాటిళ్లతో వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన
- రేషన్ డీలర్ల నియామకాల్లో అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ)/ తెలంగాణ చౌక్: తమ దుకాణాలు తమకే ఇవ్వాలని, కేటాయించిన డీలర్ల పోస్టులు రద్దు చేయాలని సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తాజామాజీ రేషన్ డీలర్లు ఆందోళనకు దిగారు. రేషన్ డీలర్ల నియామకాల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు షాపులు కోల్పోయిన 17 మంది డీలర్లు గురువారం సిరిసిల్ల సాయినగర్ వద్ద మంచినీటి ట్యాంకు ఎక్కి, పెట్రోలు బాటిళ్లు చేత పట్టుకుని మండుటెండల్లో మూడు గంటల పాటు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ డీలర్లు తాటి పద్మ, మమత, కొండ పద్మ, శారద, రేణ మాట్లాడారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన దుకాణాలను 12 ఏండ్లుగా నడుపుకుంటున్నామని తెలిపారు. అధికారులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే దుకాణాలకు నోటిఫికేషన్ వేసి, పరీక్షలు నిర్వహించారని, డీలర్ షిప్‌లను రద్దు చేసి, మరొకరికి కట్టబెట్టారన్నారు. తమ జీవనోపాధి పోయిందని, బతుకుదెరువులేక ఇక చావే గతి అంటూ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. కాంగ్రెస్ నాయకులు దుకాణాలను పైసలకు అమ్ముకుని అన్యాయం చేశారని ఆరోపించారు. అర్ధరాత్రి తహసీల్దార్ కార్యాలయంలో నియామకపు పత్రాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. సాయంత్రం 5గంటలు దాటితే టైం అయిపోయిందంటూ కసురుకునే అధికారులు రాత్రి వేళల్లో కార్యాలయాలకు వచ్చి లీడర్లకు నియామక పత్రాలు అందజేయడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. రేషన్ షాపులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకునే వరకు ట్యాంకు దిగమంటూ భీష్మించుకుని కూర్చున్నారు. ఏఎస్సీ చంద్రయ్య ఘటన స్థలానికి చేరుకుని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని ఎంత నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు. తమకు జరిగిన అన్యాయంపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినా ఏమ్రాతం పట్టించుకోలేదని ఆరోపించారు. తహసీల్దార్ షరీఫ్ వచ్చి కలెక్టర్ అందుబాటులో లేరని, వినతి పత్రం ఇస్తే కలెక్టర్‌కు ఇస్తానని చెప్పడంతో శాంతించి ఆందోళన విరమించారు. ఇక్కడ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రేషన్ డీలర్ల అధ్యక్షుడు రెడ్డిమల్ల హనుమండ్లు, కొండ పద్మ, వీ మమత, ఆడెపు సౌజన్య, జిందం రేఖ, బండారి శారద, తాటి పద్మ తదితరులు ఉన్నారు.

11 ఇంక్లైన్ గనిలో సంతకాలు చేస్తున్న కార్మికులు

టీబీజీకేఎస్ సంతకాల సేకరణ

గోదావరిఖని, సెప్టెంబర్ 26 : సింగరేణి సంస్థకు వచ్చిన ₹4,701 కోట్ల లాభాల్లో 33 శాతం కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ నాయకులు ఆందోళన బాట పట్టారు. నికర లాభాలపై వాటాగా ₹796 కోట్లు మాత్రమే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడంపై నిరసన వ్యక్తం చేశారు. గురువారం కార్మికుల సంతకాల సేకరణ చేపట్టారు. ఆర్జీ-1, 2, 3 పరిధిలోని బొగ్గు గనులు, వివిధ విభాగాల వద్ద కార్మికులు స్వచ్ఛందంగా సంతకాలు చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ నాయకులు మాట్లాడుతూ, వార్షిక నికర లాభాలు ₹4,701 కోట్లు సాధించగా 33 శాతం వాటాతో ప్రతి కార్మికుడికి దాదాపు ₹4 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. కార్మికుల ఆవేదనను అర్థం చేసుకొని లాభాల వాటాగా ₹1,550 కోట్లు చెల్లించాలని కోరారు.

ఖాదీ వస్త్రాలపై ప్రత్యేక డిస్కౌంట్

కరీంనగర్ హౌసింగ్ బోర్డు కాలనీ, సెప్టెంబర్ 26 : గాంధీ జయంతి, దీపావళి, కార్తీక పౌర్ణమి పండుగల సందర్భంగా కరీంనగర్‌లోని మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఖాదీ వస్త్రాల కొనుగోలుపై 40శాతం డిస్కౌంట్ లభిస్తుందని ఆ సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశం నవంబర్ 16 వరకు ఉంటుందని చెప్పారు. ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి, నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఖాదీ గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించాలని కోరారు.

ఎన్టీపీసీకి అవార్డుల పంట

అవార్డుతో ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు

జ్యోతినగర్, సెప్టెంబర్ 26 : పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఎన్టీపీసీ ఇంధన రంగంలో చూపిస్తున్న సామర్థ్యం ప్రతిభకు మూడు ఎనర్జీ లీడర్ షిప్ అవార్డులు లభించాయి. బుధవారం రాత్రి న్యూఢిల్లీలోని హయత్ రీజెన్సీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డ్స్-2024లో రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, భారత ప్రభుత్వ మాజీ పవర్ సెక్రటరీ అనిల్ రజ్దార్ చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇంధన సంరక్షణలో స్థిరమైన పనితీరు, నాయకత్వ సమర్థతకు పవర్ విభాగంలో ఒక ఎనర్జీ కంపెనీ అవార్డు, ఇంధన ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిచినందుకు పునరుత్పాదక విభాగంలో మరొక ఎనర్జీ కంపెనీ అవార్డు, ఇండస్ట్రీయల్ విభాగంలో ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు లభించింది.

పెండింగ్ బిల్లులు ఇప్పించాలి

ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తున్న టీఎన్జీవో నాయకులు

- పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టాలి
- నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలి
- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపల్లి, సెప్టెంబర్ 26 : ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఇప్పించాలని, పాత పెన్షన్ విధానం అమలుచేయాలని టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఇప్పటికే రెండు పీఆర్సీలు నష్టపోయారని, న్యాయం జరిగేలా చూడాలని, జూలై ఒక టో నుంచి పీఆర్సీని అమలు చేసి మానిటరీ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోల సంఘ భవనంలో గురువారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించి, పలు అంశాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. అలాగే ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఒకటో తేదీన జీతం ఇవ్వడంపై ముఖ్యమంత్రికి ఉద్యోగుల పక్షాన శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సరెండర్‌లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, పిల్లల పెళ్లి లకని విత్ డ్రా చేసుకున్న జీపీఎఫ్ ఖాతాలోని డబ్బులు రాక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగులు అనేక రకాల సమస్యతో సతమతమవుతున్నారని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం ప్రవేశపెట్టేలా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు. ప్రభుత్వం జీవో నెంబర్ 79 విడుదల చేసిన క్రమంలో కలెక్టర్ యుద్ధప్రతిపాదికన కారుణ్య నియామకాలు చేపట్టి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వోద్యోగుల భాగస్వామ్యంతో నగదు రహిత వైద్యం అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కుబేర్ ద్వారా కాకుండా పాత పద్ధతి ద్వారా జీతభత్యాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పంచాయతీలు, హెడ్‌డబ్ల్యూ, అగ్రికల్చర్ ఆఫీసర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అలాగే అన్ని జిల్లాలోని యూనిట్లు, డిపార్ట్‌మెంట్ ఫోరం సభ్యత్వ నమోదు కార్యక్రమం, సర్వసభ్య సమావేశాలు చేపట్టి ఎన్నికలు నిర్వహించి సంఘాన్ని బలోపేతం కృషి చేయాలని సూచించారు. పై సమస్యలపై టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు తీర్మానాలు ప్రవేశపెట్టగా సభ్యులందరూ ఆమోదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే కేంద్ర సంఘం ఇచ్చే పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు చేపట్టి, సమస్యలు పరిష్కరించుకునే దిశగా ముందుకు సాగుతామన్నారు. ఈ సమావేశంలో టీఎన్జీవోల కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, కోశాధికారి ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళా జేఏసీ చైర్మన్ ఇరుమళ్ల శారద, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మీందర్‌సింగ్, కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి నేరెళ్ల కిషన్, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి అంబటి నాగరాజు, చొప్పదండి అధ్యక్షుడు కామ సతీశ్, కార్యదర్శి లవ్‌కుమార్, హుజురాబాద్ అధ్యక్షులు చింతల సందీప్, జమ్మికుంట అధ్యక్షులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.